జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 14 | జూన్ | 2026 | పేజీలు : 5




# గిరిజన యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, జూన్ 13, ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని వైటీసీ శిక్షణా కేంద్రంలో 18 నుంచి 33 సంవత్సరాల వయస్సు గల గిరిజన యువతకు ఉపాధి నైపుణ్యం కోర్సులైన కంప్యూటర్, బ్యూటిఫికేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరే వారికి ఉచిత భోజనం, వసతి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 20వ తేదీ లోగా తమ లగేజ్ తో నేరుగా వైటీసీ శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు.






5 లో..

# ఈ ప్రభుత్వ బడి... విజయాల గడి

- రాష్ట్ర టాపర్‌కు పునాది వేసిన భద్రాచలం గర్ల్స్ హైస్కూల్
- ఫలితాలతో విశ్వాసం గెలుచుకున్న విద్యాలయం
- ప్రభుత్వ విద్యకు కొత్త నిర్వచనం

భద్రాచలం పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ విద్యకు కొత్త నిర్వచనం ఇస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని బోధన, అత్యుత్తమ ఫలితాలు, డిజిటల్ విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబోధనతో తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటోంది. ఇటీవల తెలంగాణ ఇంటర్ రాష్ట్ర టాపర్‌కు పునాది వేసిన విద్యాసంస్థగా గుర్తింపు పొందిన ఈ పాఠశాల, ప్రభుత్వ బడులపై మారుతున్న ప్రజల దృక్పథానికి ప్రతీకగా నిలుస్తోంది. ఫీజులు కాదు... ఫలితాలే ముఖ్యం అని నిరూపిస్తూ వేలాది మంది బాలికల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న భద్రాచలం గర్ల్స్ హైస్కూల్‌పై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)
(భూక్యా రంజిత్ నాయక్)

# గంజాయి మత్తులో యువకుడి వీరంగం



- 17 ఏళ్ల బాలుడిపై దాడి
- గట్టాయిగూడెంలో ఘటన.
- రాత్రివేళ బయటకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన.

**పాల్వంచ, జూన్ 13, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని గట్టాయిగూడెం 36వ డివిజన్ పరిధిలో గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు పాదచారులపై దాడులకు పాల్పడిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. స్థానికుల వివరాల ప్రకారం, గంజాయి మత్తులో ఉన్న ఓ వ్యక్తి 17 సంవత్సరాల యువకుడిపై అకస్మాత్తుగా దాడి చేశాడు. బాలుడిని కింద పడేసి పిడిగుద్దులతో విచక్షణారహితంగా కొడుతూ, ముఖంపై తీవ్రంగా దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుంటారనే భయంతో దాడి చేసిన వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ ఘటనలో బాధిత యువకుడికి గాయాలు కాగా, స్థానికులు అతనికి సహాయం చేసినట్లు తెలిసింది. ఈ సంఘటనతో

మిగతా 2 లో...

# ఐదు కిలోల కుక్కర్ ఐఈడీలు నిర్వీర్యం



2 లో...

# టిప్పర్ డ్రైవర్లకు లైసెన్స్ అవసరం లేదా..?

- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న టిప్పర్ యజమానులు..?
- అధికారుల తనిఖీలు ఎక్కడ
- తక్కువ బడ్జెట్‌లో అర్హతలేని డ్రైవర్లకే స్టీరింగ్..?
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైనం
- పకడ్బందీ తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్



**టేకులపల్లి, జూన్ 13 (ప్రజాజ్యోతి):** టేకులపల్లి మండల పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న టిప్పర్ వాహనాల సంచారం ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా భారీ వాహనాలను నడిపే డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టప్రకారం హెవీ మోటార్ వెహికల్

మిగతా 2 లో...

## ఐదు కిలోల కుక్కర్ ఐఈడీలు నిర్వీర్యం



**చర్ల, జూన్ 13: (ప్రజాజ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌ను నక్సల్ రహిత రాష్ట్రంగా ప్రకటించిన అనంతరం కూడా అడవుల్లో నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. గరియాబంద్ జిల్లా మైన్‌పూర్ ప్రాంతంలోని దాదిపాని అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు నిర్వహించిన గాలింపు చర్యల్లో భారీ నక్సల్ డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి.సీఆర్పీఎఫ్ 65వ బెటాలియన్ జవాన్లు, జిల్లా పోలీసులతో కలిసి సంయుక్తంగా చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్‌లో ఈ డంప్‌ను గుర్తించారు. నక్సలైట్లు గతంలో రహస్యంగా దాచిపెట్టిన పేలుడు పదార్థాలు, ఆయుధాలు ఇతర సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో 5 కిలోల కుక్కర్ ఐఈడీ, 4 కిలోల ప్రెషర్ కుక్కర్ బాంబు, ఒక భర్మర్ రైఫిల్, ఒక రైఫిల్ మ్యాగజైన్, యూబీజీఎల్ రౌండ్లు, బాణసంచా తయారీకి సంబంధించిన సామగ్రి ఉన్నాయి. భద్రతా బలగాలు మొత్తం సామగ్రిని స్వాధీనం చేసుకోగా, అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఐఈడీని అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసి ధ్వంసం చేశారు.లొంగిపోయిన నక్సలైట్లు, నిఘా వర్గాలు అందించిన సమాచారం ఆధారంగా నక్సల్స్ దాచిపెట్టిన డంప్‌ల కోసం అడవుల్లో నిరంతరం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. నక్సల్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా ఈ స్వాధీనం కీలక విజయంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

## గంజాయి మత్తులో యువకుడి వీరంగం

(మొదటి పేజీ తరువాయి…)

గట్టాయిగూడెం ప్రాంత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రి వేళల్లో అత్యవసర పనుల నిమిత్తం మార్కెట్‌కు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే పౌరులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని మరింత పెంచి, దాడికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా పునీత అంతోని మహోత్సవ వేడుకలు



**ఆళ్ళపల్లి. జూన్13(ప్రజా జ్యోతి)**ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు పంచాయతీ జిన్నెలగూడెం గ్రామంలో పునీత అంతోని మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవరెండ్ ఫాదర్ కొమ్ము అంతోని హాజరై పునీత అంతోని జీవితం, ఆధ్యాత్మిక సేవలు, అద్భుతాల గురించి భక్తులకు వివరించారు.విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జేసు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, ముత్తాపురం, గుండాల, ఆళ్లపల్లి, మర్కోడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్కోడు సర్పంచ్ సుతారి రమాదేవిని పట్టుశాలువాతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సిస్టర్లు, ఉపదేశకులు, సంఘ నాయకులు, యువతీ యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యుడితో… అల్లోపాతి సేవలా…?

- ప్రజారోగ్యం గాలిలో దీపమేనా..?
- సౌకర్యాలు ఫుల్ సేవలు నిల్
- సిబ్బంది కొరతతో కుంటుపడుతున్న వైద్య వ్యవస్థ
- 'ఎమ్మెల్యే సాబ్.. జరా ఇదర్ దేఖో' అంటూ సీపీఐ నేత నరాటి ప్రసాద్ హాట్ కామెంట్స్





**ములకలపల్లి, జూన్ 13 (ప్రజాజ్యోతి):** మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆరోగ్య శాఖ సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. గతంలో 20 గ్రామపంచాయతీల ప్రజలకు వైద్య సేవలు అందించిన మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారి సౌకర్యాలు ఫుల్ – సేవలు నిల్ అన్న చందంగా మారాయి.రోగులకు వైద్యం అందించాల్సిన వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో, డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయుర్వేద వైద్యుడితో అలోపతి వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. ఇది వైద్య నిబంధనలకు విరుద్ధమని, రోగుల ప్రాణాలతో చెలగాటమాడినట్లేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులకు మందులు అందించే ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉండగా, రక్తం, మూత్రం తదితర వైద్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ కూడా అందుబాటులో లేరు. దీంతో పరీక్షల కోసం రోగులు ప్రైవేట్ కేంద్రాలు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల పేద ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.నాలుగు స్టాఫ్ నర్స్ పోస్టులకు ముగ్గురు మాత్రమే పనిచేస్తుండగా, వారిలో ఒకరు డిప్యుటేషన్‌పై వచ్చినవారే. దీంతో ఇప్పటికే పరిమిత సిబ్బందితోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

### గ్రామీణ ప్రాంతాల్లో అందని ఆరోగ్య సేవలు….

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల్లో కీలకమైన ఏఎన్ఎం పోస్టులు తొమ్మిది ఉండగా, ప్రస్తుతం కేవలం ఇద్దరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో తల్లి–శిశు సంక్షేమ కార్యక్రమాలు, టీకాల కార్యక్రమాల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతోంది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ), పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్), హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ఈఓ) వంటి ప్రజారోగ్యానికి సంబంధించిన కీలక పోస్టులు కూడా ఖాళీగా ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కొందరు అధికారులు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో స్థానికంగా వైద్య సేవలు మరింత దెబ్బతిన్నాయి.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, మండలంలోని వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్తే అంతే సంగతులు….

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లిన రోగులకు వైద్యులు అందుబాటులో లేకపోవడం, మందులు అందించే ఫార్మసిస్ట్ లేకపోవడం, వైద్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. "ప్రజల ఆరోగ్యాన్ని ఎవరు పట్టించుకుంటారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి, డిప్యుటేషన్‌లపై ఆధారపడకుండా శాశ్వత సిబ్బందిని నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆరోగ్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### 'ఎమ్మెల్యే సాబ్.. జరా ఇదర్ దేఖో' : సీపీఐ నేత నరాటి ప్రసాద్ హాట్ కామెంట్స్



మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఖాళీలను భర్తీ చేసి, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ నరాటి ప్రసాద్ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. "ఎమ్మెల్యే సాబ్.. జరా ఇదర్ దేఖో" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మండల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తారా? లేక ప్రజల ప్రాణాలను గాలికి వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# టిప్పర్ డ్రైవర్లకు లైసెన్స్ అవసరం లేదా..?

(మొదటి పేజీ తరువాయి…)

(హెచ్ యంవీ) లైసెన్స్ కలిగిన వారే టిప్పర్లు నడపాల్సి ఉండగా, కొందరు యజమానులు అర్హతలు లేని వ్యక్తుల ను డ్రైవర్లుగా నియమిస్తున్నారనే ఆ రోపణలు వినిపిస్తున్నాయి. సంబంధి త శాఖల తనిఖీలు లేకపోవడంతో ని బంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ››› లైసెన్సులపై అనుమానాలు

మండలంలోని గనులు, క్రషర్లు, ని ర్మాణ రంగానికి సంబంధించిన పను ల్లో వందలాది టిప్పర్లు ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ వాహనాలను నడిపే ప్రతి డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే హెవీ వెహికల్ లైసెన్స్ ఉందా అనే అంశంపై ఎలాం టి పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అనుభవం లేని వారు కూడా టిప్పర్లు నడుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

### ››› తక్కువ ఖర్చు కోసం నిబంధనలకు తూట్లు

కొంతమంది టిప్పర్ యజమానులు అనుభవజ్ఞులైన డ్రైవర్లకు ఎక్కువ వేత నం చెల్లించాల్సి రావడంతో తక్కు వ జీతాలకు పనిచేసే వ్యక్తులను నియ మించుకుంటున్నా రని ఆరోపణలు ఉ న్నాయి. డ్రైవింగ్‌లో సరైన శిక్షణ లేకపోయినా వాహనాల బాధ్యత అప్పగించడం వల్ల ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

### ››› ప్రమాదాల ముప్పు

టేకులపల్లి మండలంలోని ప్రధాన ర హదారులు, గ్రామీణ ప్రాంతాల్లో టి ప్పర్లు అధిక వేగంతో సంచరిస్తుండ టం ప్రజలను భయాందోళనలకు గు రి చేస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా ఎప్పుడైనా పెద్ద ప్రమాదాలు జ రిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### ››› ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?

అర్హతలేని డ్రైవర్లతో వాహనాలు నడిపించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే బాధ్యత ఎవరిపై ఉంటుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.ప్రమాదాల్లో ప్రా ణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగితే బా ధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో యజమానులు, డ్రైవర్లు, సంబంధిత అధికారులు బాధ్యత నుం చి తప్పించుకోలేరని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ››› అధికారుల నిర్లక్ష్యమా..?

రవాణా శాఖ, పోలీసులు, గనుల శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లైసెన్సు లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, అనుమతులు తదితర పత్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయకపోవడం వల్లే అక్రమాలు పెరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ››› ప్రజల డిమాండ్

టిప్పర్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్, బీమా, అనుమతుల పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ప్రజ లు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించాలని డి మాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగాక స్పందించడం కం టే ముందస్తు చర్యల ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

### ››› నిబంధనలు పాటిస్తేనే భద్రత

భారీ వాహనాలను అర్హత కలిగిన డ్రైవర్లతోనే నడిపించాలి. చెల్లుబాటు అయ్యే లైసెన్స్, ఫిట్‌నెస్, బీమా వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. అధికారుల పర్యవేక్షణ, యజమానుల బాధ్యతాయుత వైఖరి ఉంటేనే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారిపై అత్యాచారం చేసిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

- ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి
- చిన్నారిపై అత్యాచార ఘటనపై ఐద్వా ఆధ్వర్యంలో నిరసన



భద్రాచలం టౌన్, జూన్ 13 ప్రజాజ్యోతి

ఖమ్మంలో 12 సంవత్సరాల చిన్నారిపై అత్యాచారం చేసి హత్యాయత్నానికి పాల్పడిన కామాంధుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి అధ్యక్షతన జరిగిన సభలో డి సీతాలక్ష్మి మాట్లాడారు. ముక్కుపచ్చలారని చిన్నారిపై అగత్యానికి పాల్పడ్డ వ్యక్తి తన రాక్షసత్వాన్ని చూసి భయపడి కేకలు వేసిన చిన్నారిని ఐదంతస్తుల డాబా పై నుండి తోసేసి చంపాలని ప్రయత్నించాడని అన్నారు. వెంటనే స్థానికులు చూసి ఆసుపత్రికి తరలించడంతో చిన్నారికి ప్రాణాపాయం తప్పిందని ఇప్పటికీ తన ఆరోగ్యం విషమంగానే ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం ప్రాంతంలోనే ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం ప్రభుత్వానికి అవమానమన్నారు. ఆడపిల్లలకు తమ స్వయ రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణ నిర్వహించాలని సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. మానసిక ధైర్యం పెంపొందించుకునేందుకు సెమినర్లు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జీవన జ్యోతి, ఇతర మహిళ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు తక్షణమే పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి

- టీపీటీఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి
- ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు



ఆళ్ళపల్లి. జూన్13(ప్రజా జ్యోతి) నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రాకపోవడం విచారకరమని(టీపీటీఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, (ఎల్ఎఫ్ఎల్) హెచ్ఎం కొమరం లాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15 నుండి బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం విలేకరులతో సమావేశం మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పాఠ్యపుస్తకాలు సకాలంలో అందకపోతే బోధన, అభ్యసన ప్రక్రియ తీవ్రంగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం స్ఫూర్తితో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. పుస్తకాల సరఫరాలో జాప్యాన్ని నివారించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# అంగన్వాడీలే చిన్నారులకు భరోసా

చర్ల, జూన్ 13 :(ప్రజా జ్యోతి ): ప్రీ ప్రైమరీ పాఠశాలల పేరుతో అంగన్వాడీ వ్యవస్థ ప్రాధాన్యాన్ని తగ్గించే చర్యలను విరమించుకోవాలని, అంగన్వాడీ కేంద్రాలనే మరింత బలోపేతం చేయాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన తల్లులు కోరారు. చర్ల మండలంలోని కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సమావేశానికి కొత్తపల్లి సర్పంచ్ నాగలక్ష్మి, సీఐటీయూ అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాధాకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లులు "అంగన్వాడీలను కాపాడాలి చిన్నారుల భవిష్యత్తును రక్షించాలి" అంటూ నినాదాలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ పేద , గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలే తొలి విద్యా వేదికలని పేర్కొన్నారు. పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆటల ద్వారా అభ్యాసం, తల్లులకు ఆరోగ్య–పోషణపై అవగాహన వంటి సేవలు అంగన్వాడీల ద్వారానే సమర్థవంతంగా అందుతున్నాయని తెలిపారు. అలాంటి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయ విధానాలతో దాని ప్రాధాన్యాన్ని తగ్గించడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించి సేవలను మరింత విస్తరించాలని సమావేశంలో పాల్గొన్న తల్లులు కోరారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి అంగన్వాడీ వ్యవస్థను కొనసాగించాలంటూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు విజయశీల, మండల సెక్టార్ బాధ్యులు కమల మనోహరి, నాగమణి, త్రివేణి, చిలకమ్మ, సుగుణ, సావిత్రి, భద్రమ్మ, రాధ, అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి, రమాప్రభ, ఆయాలు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవి సెలవుల ముగింపువేళ.... కిటకిటలాడిన రామాలయం

- భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి అర్చన





భద్రాచలం టౌన్ , జూన్ 13 ప్రజాజ్యోతి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. వేకువ జాము నుంచే పవిత్రగోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ గత మూడు రోజులుగా ఎక్కువగానే ఉంటుంది. ఆదివారం మరింత పెరిగే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శనివారం సందర్భంగా స్వామి వారికి స్వర్ణ తులసి అర్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# కొత్త మార్కెట్ కు మాజీ ఎమ్మెల్యే కుంజాబొజ్జి పేరు పెట్టాలి

- ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక తీర్మానం



భద్రాచలం టౌన్, జూన్ 13,ప్రజాజ్యోతి భద్రాచలం నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి ఏజెన్సీలోని నిరుపేదలకు సేవలందించిన కుంజాబొజ్జి పేరును భద్రాచలంలోని కొత్త మార్కెట్ కు పెట్టాలని శనివారం భద్రాచలంలో జరిగిన ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. జేఏసీ నాయకులు పాయం రవివర్మ మాట్లాడుతూ 1985, 1990, 1995 సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా గెలుపొందిన కుంజాబొజ్జి అత్యంత నిజాయితీ పరుడిగా పని చేస్తూ మరణించే వరకు సాధారణ జీవితాన్ని గడపడంతో పాటు ప్రజల కోసమే నిరంతరాయంగా పని చేశారని, అటువంటి మహానుభావుడిని స్మరించుకోవాల్సిన బాధ్యత భద్రాచలం ఏజెన్సీవాసులపై ఉందన్నారు. పాల్వంచలో ఉన్న ఐటీడీఏను భద్రాచలంకు తీసుకురావడం, భద్రాచలం వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా మార్చడం, డిగ్రీ కళాశాలను పీజీ కళాశాలగా అప్ గ్రేడ్ చేయడం, పట్టణంలో గురుకుల పాఠశాల, కళాశాల ఏర్పాటు వంటి ఎన్నో అంశాల్లో కుంజాబొజ్జి చురుగ్గా వ్యవహరించారన్నారు. అటువంటి మహనీయుని పేరుతో కొత్త మార్కెట్ కు పెట్టాలని తీర్మానించారు. ఆ తీర్మానం కాపీలను భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణకు అందజేశారు.

# మావోయిస్టుల 8 డంప్‌లు స్వాధీనం




చర్ల, జూన్ 13:(ప్రజా జ్యోతి ):ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లలో సీఆర్పీఎఫ్ 199వ బెటాలియన్ మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. పీడియా, కుప్పాగూడ ప్రాంతాల పరిధిలోని ఎడ్రి, హర్రా, మదుంపార గ్రామాల అటవీ ప్రాంతాల్లో నిర్వహించిన విస్తృత గాలింపు చర్యల్లో నక్సలైట్లు దాచిపెట్టిన 8 డంప్‌లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ డంప్‌లలో భారీ పరిమాణంలో ఐఈడీలు, ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీ సామగ్రి లభ్యమయ్యాయి. సీఆర్పీఎఫ్ 199వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ కుమార్ మార్గదర్శకత్వంలో, ద్వితీయ కమాండ్ అధికారి కుమార్ నీరజ్ పర్యవేక్షణలో బి, ఎఫ్ కంపెనీలు , యంగ్ ప్లాటూన్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. బి/199 కంపెనీ, యంగ్ ప్లాటూన్‌కు కంపెనీ కమాండర్ రాజీవ్ కుమార్ నాయకత్వం వహించగా, ఎఫ్/199 కంపెనీకి ఇన్‌స్పెక్టర్ కె.బి. పాండా నేతృత్వం వహించారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు దట్టమైన అటవీ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నక్సల్స్ రహస్యంగా దాచిన 8 డంప్‌లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఒక బీజీఎల్ రైఫిల్, ఒక 8 ఎంఎం రైఫిల్, ఒక 12 బోర్ రైఫిల్, 21 ఐఈడీలు, కార్డెక్స్ వైర్, సేఫ్టీ ఫ్యూజ్, ఎలక్ట్రిక్ వైర్లు, ఎయిర్ గన్ రౌండ్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నక్సల్స్ దుస్తులు తదితరాలు ఉన్నాయి. మొత్తం 58 రకాల వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎడ్రి, హర్రా, మదుంపార ప్రాంతాలు గతంలో నక్సల్స్ కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉన్నప్పటికీ, సీఆర్పీఎఫ్ చేపడుతున్న నిరంతర ఆపరేషన్లతో వారి ప్రభావం గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించారు. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధి కోసం సీఆర్పీఎఫ్ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లను మరింత ముమ్మరం చేసి ప్రాంతాన్ని పూర్తిగా నక్సల్స్ రహితంగా మార్చేందుకు చర్యలు కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- మండల విద్యాధికారి తోట మల్ల రమ



**భద్రాచలం టౌన్, జూన్ 13 ప్రజాజ్యోతి** భద్రాచలం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి తోమట్ల రమ అన్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశాన్ని భద్రాచలం మండల విద్యాధికారి తోటమల్ల రమ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అం దుబాటులో ఉన్నాయని తెలిపారు .తాగునీటి వసతి మరుగుదొడ్లు ,పరిశుభ్రతతో పాటు ఇతర సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు ,ఇప్పటికే పా ఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. తొలి రోజు నుంచే మధ్యాహ్న భోజనము, రాగి జావా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.

## గాలివాన బాధితులకు ఆర్థిక సాయం



**చర్ల, జూన్ 13(ప్రజా జ్యోతి ):** ఇటీవల సంభవించిన గాలిదుమారాల కారణంగా నివాస గృహాన్ని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ నిరుపేద కుటుంబానికి 'మీకోసం మేమున్నాం' సేవా సంస్థ ఆర్థిక చేయూత అందించింది.చర్ల మండలం ఆర్. కొత్తగూడెం ఎస్సీ కాలనీకి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు శ్రీదేవి దంపతుల రేకుల షెడ్డు ఇల్లు తీవ్ర గాలిదుమారానికి కూలి పోవడంతో వారు నిలువ నీడ లేక కష్టాల్లో పడ్డారు. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఈ కుటుంబం ఇల్లు మరమ్మతులు చేసుకునే స్థోమత లేకపోవడంతో 'మీకోసం మేమున్నాం' బృందాన్ని ఆశ్రయించారు.దీనిపై స్పందించిన సంస్థ సభ్యులు వాట్సాప్ గ్రూపుల ద్వారా నిధుల సేకరణ చేపట్టి రూ.9,500 లను సమీకరించారు. ఈ మొత్తాన్ని శనివారం చర్లలోని సంస్థ కార్యాలయంలో కార్తికేయ రోహిత్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు కారణంగా ఓ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిన పరిస్థితి బాధాకరమని అన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సమాజం అండగా నిలిస్తే వారి జీవితాల్లో ఎంతో మార్పు తీసుకురాగలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీవీ ప్రతాప్, దొడ్డి సూరిబాబు, సొల్లంగి నాగేశ్వరరావు, కవ్వాల రాము, మామిడి సాయి, రామ్మోహన్‌రావు, మెంతుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## సరోజినీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం



**బూర్గంపహాడ్, జూన్ 13 (ప్రజా జ్యోతి):** బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బి ఆర్ ఎస్ నాయకులు, టీ టైం యజమాని బెజ్జంకి కనకాచారి తల్లిదండ్రులు వీర రాఘవాచారి ధనలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం శనివారం భద్రాచలంలోని సరోజినీ వృద్ధాశ్రమం లో 150 మంది వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రతి ఏటా తన తల్లిదండ్రులను స్మరించుకుంటూ అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సరోజినీ దేవి, వృద్ధులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

# బినామీ ఫెర్టిలైజర్ షాపులను నివారించాలి

- సేవాలాల్ సేన డిమాండ్
- గిరిజనుల పేర్లతో లైసెన్సులు
- నకిలీ విత్తన మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి



**పాల్వంచ, జూన్ 13 ప్రజాజ్యోతి:** ఏజెన్సీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బినామీ ఫెర్టిలైజర్ వ్యాపారాలను అరికట్టి, అమాయక రైతులను దోచుకుంటున్న నకిలీ విత్తన మాఫియాపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు.పాల్వంచ మండల అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సేవాలాల్ సేన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు కేవలం నామమాత్రంగానే జరుగుతున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు స్థానిక గిరిజనుల పేర్లతో బినామీ లైసెన్సులు పొంది ఫెర్టిలైజర్ దుకాణాలను నిర్వహిస్తున్నారని తెలిపారు.అసలు యజమానులు ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో ఉంటూ, ఇక్కడ తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మందులు, ఎరువులు, విత్తనాలపై సరైన అవగాహన లేని వ్యక్తులను తక్కువ వేతనాలకు నియమించి దుకాణాలు నడుపుతున్నారని విమర్శించారు. దీంతో రైతులకు తప్పుడు సూచనలు అందించి, పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అమాయక గిరిజన రైతుల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని ఖాతాల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా మండలాల వారీగా ప్రతిరోజూ ఆకస్మిక దాడులు నిర్వహించాలని కోరారు. లైసెన్స్ కలిగిన అసలు యజమాని దుకాణంలో ఉన్నాడా, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి వ్యవసాయ ఇన్‌పుట్లపై తగిన అవగాహన ఉందా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘిస్తూ నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపుల లాలు నాయక్, నరేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ మిడిదొడ్ల నాగేశ్వరరావుకు విప్లవ జోహార్లు

- ఐఎఫ్‌టీయూ నేత మంకెన వెంకటేశ్వర్లు.
- కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్.
- సంతాప సభలో నివాళులు.




**పాల్వంచ, జూన్ 13, ప్రజాజ్యోతి:** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ మిడిదొడ్ల నాగేశ్వరరావు మృతికి సంతాపంగా శనివారం పాల్వంచలోని నటరాజ్ సెంటర్‌లో సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కామ్రేడ్ నాగేశ్వరరావు కార్మిక ఉద్యమంలో అంకిత భావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. కేటీపీఎస్, బీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు.సింగరేణి కాంట్రాక్ట్ రంగంలో పనిచేస్తున్న మోటార్ వర్కర్స్ కార్మికులను రాష్ట్రవ్యాప్తంగా ఐక్యం చేసి ఉద్యమాలను నిర్మించడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ముఖ్యంగా మణుగూరు ప్రాంతంలో అనేక కార్మిక ఉద్యమాలను విజయవంతంగా నిర్వహించి, పీడిత ప్రజల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.మణుగూరులో ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్ల సంఘాన్ని ఏర్పాటు చేసి, వందలాది మంది కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. అలాగే సింగరేణి కార్మికులు చిట్‌ఫండ్ కంపెనీల మోసాలకు గురైన సమయంలో బాధితులను ఐక్యం చేసి, దోపిడీకి పాల్పడిన సంస్థలపై పోరాటాలు చేపట్టి న్యాయం కోసం కృషి చేశారని తెలిపారు.కామ్రేడ్ మిడిదొడ్ల నాగేశ్వరరావు ఆశయాల సాధన కోసం ప్రతి కార్మికుడు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని మంకెన వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నం శ్రీను, నాయకులు మల్లేష్, బుర్ర వెంకటేశ్వర్లు, రామస్వామి, గోపి, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొని కామ్రేడ్ నాగేశ్వరరావుకు నివాళులర్పించారు.

## వైభవంగా బాలాజీ స్వామివారి కళ్యాణ మహోత్సవం

- భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 13 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండు రాములు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గుండు చెన్నారావు, విజయలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గుండు చెన్నారావు, విజయలక్ష్మి దంపతులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమం భక్తిపారవశ్య వాతావరణంలో ఘనంగా ముగిసింది.







# ఈ ప్రభుత్వ బడి... విజయాల గడి

- రాష్ట్ర టాపర్‌కు పునాది వేసిన భద్రాచలం గర్ల్స్ హైస్కూల్
- ఫలితాలతో విశ్వాసం గెలుచుకున్న విద్యాలయం
- ప్రభుత్వ విద్యకు కొత్త నిర్వచనం

**భద్రాచలం పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ విద్యకు కొత్త నిర్వచనం ఇస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని బోధన, అత్యుత్తమ ఫలితాలు, డిజిటల్ విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబోధనతో తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటోంది. ఇటీవల తెలంగాణ ఇంటర్ రాష్ట్ర టాపర్‌కు పునాది వేసిన విద్యాసంస్థగా గుర్తింపు పొందిన ఈ పాఠశాల, ప్రభుత్వ బడులపై మారుతున్న ప్రజల దృక్పథానికి ప్రతీకగా నిలుస్తోంది. ఫీజులు కాదు... ఫలితాలే ముఖ్యం అని నిరూపిస్తూ వేలాది మంది బాలికల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న భద్రాచలం గర్ల్స్ హైస్కూల్‌పై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)**
**(భూక్యా రంజిత్ నాయక్)**

"చెట్టు గొప్పదనం దాని నీడలో తెలుస్తుంది... విద్యాసంస్థ గొప్పదనం దాని విద్యార్థుల విజయాల్లో కనిపిస్తుంది" అనే నానుడికి సజీవ నిదర్శనంగా నిలుస్తోంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే నిర్లక్ష్యంగా చూసే పరిస్థితులు ఉండగా, నేడు అదే ప్రభుత్వ బడి కార్పొరేట్ విద్యాసంస్థలకు సవాల్ విసురుతూ తల్లిదండ్రుల తొలి ఎంపికగా మారడం విశేషం. ఫలితాలు, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య, ఆధునిక బోధనతో ఈ విద్యాలయం ప్రభుత్వ విద్య సత్తాను చాటుతోంది.

### రాష్ట్ర టాపర్ విజయానికి ఇక్కడే పునాది

1966లో స్థాపించబడిన ఈ విద్యాలయం గత ఆరు దశాబ్దాలుగా వేలాది మంది బాలికలకు విద్యను అందిస్తూ సమాజానికి ఉన్నత పౌరులను అందిస్తోంది. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ జిల్లాలోనే ఆదర్శ ప్రభుత్వ విద్యాసంస్థగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఒక పాఠశాల స్థాయిని అంచనా వేయాలంటే అక్కడి విద్యార్థుల విజయాలను చూడాలని విద్యావేత్తలు చెబుతుంటారు. ఆ మాటను నిజం చేస్తూ ఇటీవల విడుదలైన 2026 జూనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన ప్రతిభావంతురాలు తన పదో తరగతి వరకు విద్యాభ్యాసాన్ని ఈ పాఠశాలలోనే పూర్తి చేయడం గర్వకారణంగా నిలిచింది. రాష్ట్ర టాపర్ విజయానికి పునాది వేసిన పాఠశాలగా భద్రాచలం గర్ల్స్ హైస్కూల్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మారోమ్రోగుతోంది. గతంలో కూడా ఈ పాఠశాలలో చదివిన పలువురు విద్యార్థినులు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ రంగాల్లో విశిష్ట స్థానాలను అధిరోహించడం గమనార్హం.

### ఫలితాలే పాఠశాల నాణ్యతకు అద్దం

"మాటల కంటే చేతలే గొప్పవి" అన్నట్లు ఈ పాఠశాల ప్రతిభను ఫలితాలే చాటుతున్నాయి. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థినుల సంఖ్య గణనీయంగా ఉండగా, పలువురు జాతీయ స్థాయి ప్రతిభా స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. విద్యార్థినులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పోటీ పరీక్షల్లోనూ రాణించేలా ప్రత్యేక శిక్షణ అందించడం ఈ పాఠశాల ప్రత్యేకతగా నిలుస్తోంది.

### ప్రభుత్వ బడివైపు పెరుగుతున్న అడుగులు

కాలానుగుణంగా విద్యలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ పాఠశాల ఆధునిక బోధనా విధానాలను అమలు చేస్తోంది. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధన, కృత్యాధార విద్య, ప్రత్యేక గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా గుర్తించి, ఆమె ప్రతిభను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వల్లే ఈ పాఠశాల విజయపథంలో దూసుకెళ్తోందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలలే నాణ్యమైన విద్యకు కేంద్రాలన్న అభిప్రాయం ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి.

భద్రాచలం గర్ల్స్ హైస్కూల్‌లో విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, ఫలితాలు చూసి అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇక్కడికి మార్చుతున్నారు. గత కొన్నేళ్లుగా విద్యార్థినుల చేరికలు గణనీయంగా పెరగడం ఈ పాఠశాలపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. "ఫీజులు కాదు... ఫలితాలే ముఖ్యం" అనే భావనతో తల్లిదండ్రులు ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతున్నారు.

### భవిష్యత్తుకు భరోసా... బాలికల కలలకు వేదిక

పాఠశాల అభివృద్ధిలో దాతలు, పూర్వ విద్యార్థినుల సహకారం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. తరగతి గదుల నిర్మాణం, వేదికల ఏర్పాటు, సుందరీకరణ పనులు, విద్యార్థినుల సౌకర్యాల మెరుగుదల కోసం అందించిన సహకారం పాఠశాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. నాణ్యమైన విద్య, విలువలు, క్రమశిక్షణ, ఆధునిక బోధన, అద్భుత ఫలితాలు... ఈ ఐదు అంశాలను సమన్వయం చేస్తూ భద్రాచలం గర్ల్స్ హైస్కూల్ ప్రభుత్వ విద్యకు కొత్త నిర్వచనం ఇస్తోంది. "ప్రభుత్వ బడి అంటే పేదల బడి కాదు... ప్రతిభను తీర్చిదిద్దే గొప్ప విద్యాలయం" అని నిరూపిస్తూ ప్రతి బాలిక భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది. ఒకప్పుడు కార్పొరేట్ పాఠశాలల వైపు పరుగులు తీసిన తల్లిదండ్రులు, నేడు ప్రభుత్వ బడుల వైపు అడుగులు వేస్తున్నారంటే అది భద్రాచలం గర్ల్స్ హైస్కూల్ వంటి విద్యాసంస్థలు సాధిస్తున్న ఫలితాల వల్లే.

### విలువలతో కూడిన నాణ్యమైన విద్యే మా ప్రత్యేకత

**తోటమల్ల రమాదేవి, హెచ్ఎం**



క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, విలువలతో కూడిన విద్య మా పాఠశాల ప్రధాన బలాలు. ప్రతి విద్యార్థిని ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మా పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకోవడం మాకు గర్వకారణం. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించవచ్చని మా విద్యార్థినుల విజయాలు నిరూపిస్తున్నాయి. భవిష్యత్తులో మరింత మంది బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా కృషి కొనసాగిస్తాం" అని తెలిపారు.

## అరుదైన గౌరవం అందుకున్న ఆళ్ళపల్లి ముద్దుబిడ్డ

- వివిధ రంగాలలో విశేష సేవలు గుండెబోయిన రామకృష్ణ



**ఆళ్ళపల్లి,జూన్13 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన సాయిబాబా, లక్ష్మి దంపతుల కుమారుడు గుండెబోయిన రామకృష్ణకు ప్రతిష్టాత్మక తెలంగాణ స్ఫూర్తి నంది గౌరవ పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందజేశాయి.వివిధ సామాజిక, సాంస్కృతిక, న్యాయ సేవా రంగాలలో రామకృష్ణ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఆయన సేవా ప్రస్థానంలో కొన్ని ముఖ్యమైన ఘట్టాలు:2012 ఆజాద్ యాత్ర' ద్వారా సంస్కారవంతమైన సమాజం కోసం, సారాయి నిషేధం మరియు ప్రజల్లో విజ్ఞతను పెంపొందించడంపై విస్తృత ప్రచారం చేశారు.2018 సమాజానికి ఉపయోగపడే అంశాలపై పుస్తక రచన చేశారు.2021ఆయన సేవలకు గాను ప్రతిష్టాత్మక 'లాఫింగ్ బుద్ధా నేషనల్ ఫెలోషిప్ అవార్డు' దక్కింది.2022ఆధ్యాత్మిక రంగంలో 'అర్చక పురోహిత యోగ్యత పత్రం' అందుకున్నారు.2023 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ ( డిఎస్ ఎల్ ఏ) ద్వారా ప్రజలకు ఉచిత న్యాయసేవ సలహాలు, సూచనలు అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.ఈ విధంగా ఎన్నో రంగాల్లో నిరంతరం సమాజ సేవకు అంకితమైన గుండెబోయిన రామకృష్ణకు 'తెలంగాణ స్ఫూర్తి నంది గౌరవ పురస్కారం' దక్కడం పట్ల గ్రామ ప్రజల అభినందనలు తెలియజేశారు.

## గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిన కాంగ్రేస్ ప్రభుత్వం

- గిరిజన గ్రామాల వంతెనల పనులు వెంటనే ప్రారంభించాలి
- బిజెపి జిల్లా నాయకులు పానిశెట్టి వెంకటేశ్వర్లు

**ములకలపల్లి జూన్ 13,(ప్రజాజ్యోతి):** మండలం సీతారామపురం గ్రామపంచాయతీ పరిధిలోని అన్నారం, చింతలపాడు, గుర్రాలకుంట, ధర్మన్ననగర్ గ్రామాలకు వెళ్లే మార్గంలో నిర్మాణం నిలిచిపోయిన మూడు హై లెవల్ వంతెనల పనులను వెంటనే ప్రారంభించాలని బిజెపి జిల్లా నాయకులు పోనిశెట్టి వేంకటేశ్వర్లు డిమాండ్ చేసారు. శనివారం బీజేపీమండల అధ్యక్షుడు గుగులోత్ శంకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పనులు నిలిపోయిన వంతెలను సం దర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వ ర్లు పాల్గొని మాట్లాడారు., సుమారు రూ.5 కోట్లతో మంజూరైన మూడు హై లెవల్ వంతెనలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేసినప్పటికీ ఏడాది గడిచినా పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతి వర్షాకాలంలో కాలువలు ఉప్పొంగి ప్రవహించడంతో నాలుగు గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర సేవలు కూడా అందని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేకుంటే గ్రామస్తులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదారపు లక్ష్మణ్, భట్టు అశోక్, పర్శిక రమేష్, వరస కృష్ణ, పర్శిక నర్సింహారావు, వరస పాపయ్య, కీసర రాజు, పోడియం నర్సింహారావు, కిసరి చిరామప్ప, కుర్సం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

